ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
జనగామ
బుధవారం 4 సెప్టెంబరు 2024





వరద నష్టంపై మానుకోట కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న సీఎం



మరిపెడ మండలం పురుషోత్తమయగూడెం వద్ద కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి, సీతక్క, ఎమ్మెల్యేలు

సీతారాంతండాలో బాధిత కుటుంబంలోని చిన్నారితో మాట్లాడుతున్న రేవంత్

అధైర్యం వద్దు.. అండగా ఉంటాం..

- అధికారుల అప్రమత్తతతో ఆస్తి, ప్రాణ నష్టాన్ని తగ్గించగలిగాం
- మానుకోట జిల్లాలో 30వేల ఎకరాల్లో పంట నష్టం
- ప్రతీ ఎకరాకు రూ.10వేల పరిహారమిస్తాం
- మూడు తండాల తరలింపుతో మోడల్ కాలనీ
- సీతారాంతండా పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి
- మహబూబాబాద్ కలెక్టరేట్‌లో వరద నష్టంపై సమీక్ష

మహబూబాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వర్షం సృష్టించిన బీభత్సంతో ఎవరూ అధైర్యపడొద్దని.. తమ ప్రజాప్రభుత్వం అండగా ఉంటుందని, మహబూబాబాద్ జిల్లాలో 28 సెంటీమీటర్ల వర్షం పడిందని, జలప్రళయం వచ్చినా అధికారులు అప్రమత్త వ్యవహరించి ఆస్తి, ప్రాణనష్టాన్ని కొంత మేరకు తగ్గించగలిగారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని సీతారాంతండాను మంగళవారం సందర్శించిన ఆయన బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి భరోసా కల్పించారు. తొలుత పురుషోత్తమయగూడెం 365 జాతీయ రహదారిపై 1500 మీటర్ల మేరకు కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలించి.. వాగు ఉధృతితో ఇసుకమేటలు వేసిన ప్రాంతాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహబూబాబాద్ కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్కలతో కలిసి వర్షం, వరద నష్టంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మానుకోట జిల్లా వ్యాప్తంగా 30వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ఇక వరద బీభత్సంలోనూ నిరంతరం సహాయక చర్యల్లో పాల్గొన్న రెవెన్యూ, పోలీస్, విద్యుత్, వైద్య అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. వరద ముంపునకు గురైన సీతారాంతండా వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించిన సీరోలు ఎస్సై నగేష్ అభినందనీయుడన్నారు. ప్రకృతి వైపరీత్యం వల్ల జిల్లాలో నలుగురు మృతి చెందగా.. వారిలో ఇద్దరు మహబూబాబాద్ జిల్లా వారైతే.. మరో ఇద్దరు పక్క జిల్లా అయిన ఖమ్మానికి చెందిన వారని వివరించారు. అలాగే 215 పశువులు చనిపోయాయని, 45 ట్యాంక్‌లు, మూడు పక్కాఇళ్లు, 15 కచ్చ ఇళ్లు కూలిపోయాయని, మరో 96 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని, 125 గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడిందని, 680 మందిని వరద ముంపుప్రాంతాల నుంచి తప్పించి వసతి కల్పించామని వెల్లడించారు. చనిపోయిన ప్రతీ వ్యక్తి కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నట్లు ప్రకటించారు. పురుషోత్తమయగూడెం ఆకేరువాగులో కారు గల్లంతయి మృతి చెందిన యువ శాస్త్రవేత్త నూనావత్ అశ్విని, ఆమె తండ్రి మోతీలాల్ వారి స్వగ్రామం ఖమ్మం జిల్లా కారేపల్లి గంగారం తండాకు వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి, ఇందిరమ్మ ఇల్లు కట్టించాలని ఆదేశించామన్నారు.



పొలాల మీదుగా కాలినడకన సీతారాంతండాకు వస్తున్న సీఎం, మంత్రులు

మూడుతండాల తరలింపుతో మోడల్ కాలనీ..

ప్రతీసారి వరద ముంపునకు గురయ్యే పురుషోత్తమయగూడెం శివారు సీతారాంతండాతో పాటు మరో రెండు తండాలను సురక్షిత ప్రాంతానికి తరలించి, ఒక మోడల్ కాలనీగా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయా తండాల వారికి ప్రత్యామ్నాయంగా ఇందిరమ్మ ఇళ్లు, పట్టాలు ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశిస్తున్నట్టు ప్రకటించారు. జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా నష్టపోయిన ప్రతీ ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. మృతి చెందిన పశువులకు రూ.50వేలు, మేకలు, గొర్రెలకు రూ.5వేల చొప్పున యజమానులకు నష్టపరిహారం అందజేయాలన్నారు. మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలోనే రూ.13కోట్ల నష్టం వాటిల్లిందని, ఇప్పటి వరకు జరిగిన విపత్తును ఎదుర్కోవడం ఒకటైతే.. ఇక ముందు మరేవిధమైన ఇబ్బందులు కలుగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మునిసిపల్, పంచాయతీ రాజ్, వైద్య, రెవెన్యూ అధికారులు ముంపునకు గురైన ప్రాంతాల్లోని ఇండ్లు, రోడ్లు శుభ్రం చేయడానికి నల్లాలు, ట్యాంకర్ల ద్వార నీరందించాలని చెప్పారు. దోమల వ్యాప్తి, అంటు వ్యాధులు రాకుండా ఆరోగ్యశాఖ ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతులను చేయాలని రేవంత్‌రెడ్డి సూచించారు. ఎక్కడైతే నష్టం జరిగిందో ఆ ప్రాంతాల పునరుద్ధరణకు అవసరమైతే

మిగతా 7వ పేజీలో..



రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ విమర్శలు

- రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 3 : వర్షాలతో రైతుల పంట దెబ్బతిని, ప్రజలు కష్టాల్లో ఉంటే ఆదుకునేది పోయి రాజకీయ లబ్ధి కోసం బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. మహబూబాబాద్ కలెక్టరేట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా గంటల్లోనే 42సెంటీమీటర్ల వర్షం కురిసిందని, ఇంతటి విపత్తుఎన్నడూ చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ, జిల్లాలను పర్యటిస్తూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారని, రోడ్డు మార్గంలో ప్రయాణిస్తూ నష్టాన్ని పరిశీలించి ప్రజలకు ఓదార్పునిస్తూ అండగా నిలుస్తున్నారని, అలాంటి నాయకుడిపై ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. మంచి సలహాలు, సూచనలిస్తే స్వీకరిస్తామని, విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ దగ్గర రూ.వేల కోట్లు ఉన్నాయని, అందులో నుంచి రూ.వెయ్యి లేదా రూ.రెండు వేల కోట్లు ఇస్తే తాను కొంతకలిపి నష్ట పోయిన ప్రజల అవసరాలు తీరుస్తామన్నారు. ధ్వంసమైన రోడ్లు, ఇతరత్రా పనులను సత్వరమే మరమ్మతులు చేయించాలన్నారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండి సమన్వయంతో పని చేయడం వల్ల తక్కువ నష్టం జరిగిందని అహర్నిశలు శ్రమించిన జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు.



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి సీతక్క



విపత్కర సమయాల్లో అధికారులు అంతా అప్రమత్తంగా ఉండి సేవలందించాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు అందరినీ అప్రమత్తం చేశారని దాంతో నష్టం కొంతమేర తగ్గిందన్నారు. మానుకోట జిల్లాలో వర్షాలతో ఇళ్లలోకి నీరు చేరితే, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారని, వర్షాలతో నష్టం జరిగిన జిల్లాలకు తక్షణ సాయం కింద సీఎం రేవంత్‌రెడ్డి రూ.5కోట్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. ధ్వంసమైన రోడ్ల పునరుద్ధరణ కోసం పనులను వేగవంతం చేయాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. తొలుత జిల్లాలో వర్షాలతో జరిగిన నష్టం, తీసుకు న్న సహాయక చర్యలపై కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ పోరిక బలరాంనాయక్, ప్రభుత్వవిప్ జాటోతు రాంచంద్రునాయక్, ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, కోరం కనకయ్య, యశస్వినిరెడ్డి, కేఆర్.నాగరాజు, గండ్ర సత్యనారాయణ, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్, ఆర్డీవో అలివేలు పాల్గొన్నారు. మానుకోట మునిసిపల్ పరిధిలో దెబ్బతిన్న రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ, నాలాల ఏర్పాటుకు రూ.15 కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మునిసిపల్ చైర్మన్ రాంమోహన్ రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్దన్ వినతిపత్రం అందించారు.

ముగ్గురిని బలితీసుకున్న బొగ్గులారీ

- ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన ఘటనలో ముగ్గురి మృతి
- మృతుల్లో తొర్రూరుకు చెందిన దంపతులు, పాలకుర్తికి చెందిన మహిళ
- జనగామ జిల్లా వావిలాలలో ఘటన



హేమానీ, బుజ్జి, నసీమా మృతదేహాలు

వివరాలు 7వ పేజీలో..



బొగ్గు లారీ ఢీ కొట్టడంతో దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు

మెడికల్ కళాశాల పర్యవేక్షణలో...

రోగ నిర్ధారణ పరీక్షలు కొనసాగించాలి

కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామలోని డయాగ్నస్టిక్ సెంటర్ తనిఖీ

జనగామ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జీవో ప్రకారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్ (రక్తపరీక్షల కేంద్రం) సేవలను మెడికల్ కళాశాల పర్యవేక్షణలో కొనసాగించాలని కలెక్టర్ రిజ్వాన్ బాష ఆదేశించారు. దీంతో ఈ సెంటర్ ఇప్పటి వరకు రేడియాలజీ హబ్ మెడికల్ కళాశాల, వైద్య విధాన పరిషత్.. ఈ రెండింటిలో ఎవరి పరిధిలోకి వస్తుందనే వివాదానికి తెరపడింది. జిల్లాలో జ్వరాలు, డెంగీ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కలెక్టర్ మంగళవారం సాయంత్రం తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్ ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. సెంటర్‌లో టెక్నీషియన్లు సమయ పాలన పాటిస్తున్నారా? లేదా..? రక్త పరీక్షల రిపోర్టులు ఎన్ని గంటల్లో ఇస్తున్నారు? నిర్వహణ తీరు వంటి అంశాలపై ఆరా తీశారు. అదేవిధంగా ల్యాబ్‌లోకి వెళ్లి డెంగీ పరీక్షలు చేసే విధానం, టెక్నీషియన్ల సేవలు, యంత్ర పరికరాల పని విధానం, వంటి అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హబ్ మెడికల్ కళాశాలలో టెక్నీషియన్లు చేసిన రక్తపరీక్షలకు సంబంధించి సర్టిపై చేసేందుకు కళాశాలలో వివిధ విభాగాల్లోని మైక్రో బయోలజిస్టు, పాథాలజిస్టు, బయోకెమిస్ట్రీ, రేడియాలజిస్టు ప్రొఫెసర్లకు బాధ్యతలను అప్పగించాలన్నారు. ఇందుకు సంబంధించి రోస్టర్‌ను రూపొందించి.. షిఫ్టుల పద్ధతిలో వారికి డ్యూటీలు వేయాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. అలాగే హబ్ నిర్వహణ కోసం మెడికల్ కళాశాల పర్యవేక్షణలో నిధులను ఖర్చు చేయాలని, జనరేటర్ మరమ్మతు కూడా చేయించాలన్నారు. వైద్య సిబ్బంది సమయ పాలన పాటిస్తూ బాధ్యతగా సేవలందించాలన్నారు. లేనిచో చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవీందర్ గౌడ్, ప్రోగ్రాం అధికారులు, తదితరులు ఉన్నారు.



డయాగ్నస్టిక్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

మట్టి వినాయకుడిని పూజించాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



జనగామ రూరల్, సెప్టెంబరు 3: మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణ కాలుష్య నియంత్రణకు సహకరించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం మట్టి వినాయక ప్రతిమలను వినియోగించాలని రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినా యక విగ్రహాల తయారీలో కృత్రిమ రంగులు, రసాయనాలతో ఉన్న ప్రతిమలని వినియోగించరాదన్నారు. రసాయనాలతో ఉన్న ప్రతిమలను వినియోగిస్తే జల వనరులు. జీవరాశులు కాలుష్యానికి గురవుతున్నాయని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

డిగ్రీ విద్యార్థులకు క్విజ్ పోటీలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

జనగామ రూరల్, సెప్టెంబర్ 3: బ్యాంకుల విశిష్టతను తెలిపేందుకు డిగ్రీ విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహిస్తునట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జాతీయ స్థాయిలో విద్యార్థులకు నిర్వహించే క్విజ్ పోటీల పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంకు ఏర్పడి 90 సంవత్సరాలు పూర్తి చేస్తుకున్న సందర్భంగా డిగ్రీ విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహిస్తునట్లు తెలిపారు. ఈ క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ 10లక్షలు, ద్వితీయ బహుమతిగా రూ 8 లక్షలు, తృతీయ బహుమతిగా 6 లక్షలు అందిస్తామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సెప్టెంబర్ 17 లోపు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ . ఆర్‌బీఐ90క్వ్యూయాబిజెడ్.ఇన్ వైబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. సెప్టెంబర్ 19 నుంచి 21 వరకు పోటీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలి

ఎస్ఏఎస్ ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టర్ ఎస్ఏఎస్‌లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి రూపకల్పనపై ఉపాధ్యాయులకు గూగులేమీట్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఏఎస్ పరిక్షలో విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాదించేంతవరకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలన్నారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోని వారికి అర్థమయ్యే రీతిలో ప్రశ్నాపత్నం రూపోందిస్తూ సమాధానాలను రాబట్టే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, డీఈవో రాము, అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బుగులు వేంకన్నకు సువర్ణ పుష్పార్చన

పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



చిలుపూర్, సెప్టెంబరు 3 : మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్ట బుగులు వేంకన్న దేవాలయంలో సువర్ణ పుష్పార్చన కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ప్రతీ మంగళవారం నిర్వహించే అష్టదళ పాద పద్మారాధన పూజా కార్యక్రమాన్ని పురస్కరించుకుని రూ 40 లక్షల విలువ గల 108 స్వర్ణాలతో (బంగారం) స్వామివారి పాదాలను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం జిల్లా నలుమూలల నుంచి హాజరైన భక్తుల సమక్షంలో ఆలయ ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ నేతృత్వంలోని పూజారుల బృందం ప్రత్యేక పూజలు జరిపించారు, పూజా విశిష్టతను గూర్చి వివరించి ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా దేవస్థానం మాజీ చైర్మన్, ఆలయ అభివృద్ధి శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు - కిరణ్మయి, గుల్లపల్లి శ్రీనివాస్ - భవాని, మాజీ ధర్మకర్త సంగోజు మోహనాచారి - శంకరలక్ష్మీ దంపతులు ప్రత్యేక సేవా రుసుము చెల్లించి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో మోహన్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, రికార్డ్ అసిస్టెంట్ వీరన్న, విశాల్, గాదె రాజశేఖర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా

- తాళ్లపూసపల్లిలో రైల్వే ట్రాక్ మరమ్మతులు పూర్తి
- గూడ్స్ రైలుతో ట్రయల్‌రన్ నిర్వహణ
- ఇంటికన్నె వద్ద యుద్ధప్రాతిపదికన పనులు
- పునరుద్ధరణ చర్యల్లో వెయ్యి మందికిపైగా సిబ్బంది

వివరాలు 7లో...



ఇంటికన్నె సమీపంలో రైల్వే ట్రాక్ వేలాడిన ప్రాంతంలో జోరుగా కొనసాగుతున్న మరమ్మతు పనులు

మానవత్వాన్ని చాటుకున్న ఎమ్మెల్సీ మల్లన్న

రోడ్డుప్రమాదంలో గాయపడ్డ మహిళను తన వాహనంలో ఆసుపత్రికి తరలింపు

లింగాలఘణపురం, సెప్టెంబరు 3: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మానవత్వాన్ని చాటుకున్నారు. హైదరాబాద్ నుంచి మహబూబాబాద్‌కు మంగళవారం సీఎం పర్యటనలో పాల్గొనేందుకు బయలుదేరిన మల్లన్న లింగాలఘణపురం మండలం పటేల్‌గూడెం శివారు వద్దకు చేరుకుంటుండగానే తన కళ్లెదుటే రోడ్డుప్రమాదం జరిగి ఓ మహిళ ద్విచక్రవాహనం నుంచి కిందపడిపోయింది. వెంటనే గమనించిన తీన్మార్ మల్లన్న తన కాన్వాయ్‌ను నిలిపి బాధితురాలికి ప్రాథమిక చికిత్స అందించి ఆసుపత్రికి తర లించి మానవత్వాన్ని చాటుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పటేల్ గూడెం గ్రామానికి చెందిన పెంతల నాగయ్య అలియాస్ నాగిరెడ్డి తన భార్య సోని తో కలిసి ద్విచక్రవాహనంపై జనగామకు బయలుదేరారు. ఈ క్రమంలో జనగామ-సూర్యాపేట జాతీయ రహదారిపై పాలకుర్తి క్రాస్‌రోడ్డు వద్దకు రాగానే గుడిసెవా సుల ప్రాంతం నుంచి ఓ మహిళ అకస్మాత్తుగా రోడ్డుకు అడ్డంగా రావడంతో సడె న్‌బ్రేక్ వేయడంతో వెనుకాల కూర్చున్న సోని అదుపుతప్పి కిందపడిపోయింది. దీంతో తలకు గాయమై రక్తస్రావం జరిగింది. దీంతో పాటు బాధిత మహిళకు ఫిట్స్‌రావడంతో వెంటనే తీన్మార్ మల్లన్న తనవాహనం దిగి వచ్చి ప్రాథమిక చికిత్స చేసి బాధితురాలిని తన వాహనంలో జనగామ ఆసుపత్రికి తరలించారు.



బాధితురాలికి సాయం చేస్తున్న తీన్మార్ మల్లన్న

శాస్త్రవేత్తలకు ఉత్తమ అవార్డులు, పురస్కారాలు

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 3: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 10వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం హైదరాబాద్‌లో ఉత్తమ శాస్త్రవేత్తలకు అవార్డులు అందజేశారు. ఇందులో వరంగల్ వ్యవసాయ పరిశోధనా స్థానంలో పనిచేస్తున్న ఇద్దరు శాస్త్రవేత్తలు, ఒక సీనియర్ అసిస్టెంట్‌కు అవార్డులు దక్కాయి. ఆ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ బీజే రావు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వైస్ చైర్మన్ ఎం.రఘునందన్ చేతుల మీదుగా వారు అవార్డులను అందుకున్నారు. అవార్డు గ్రహీతలు ఐదేళ్లుగా అపరాల పంటలో నూతన కంది వంగడాలు, పంటలలో పురోగతి, విత్తనోత్పత్తిలో మెరుగైన కృషి చేసినందుకు శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.సంధ్యాకిషోర్ మండవ వెంకటరామయ్య ఉత్తమ శాస్త్రవేత్త అవార్డును అందుకున్నారు. వరిలో నూతన వంగడాల రూపకల్పనలో భాగస్వామ్యం అవడంతోపాటు వరిలో వచ్చే చీడపీడల నివారణ నిర్మూలనకు ఆధునిక పద్ధతిలో రూపొందించడంలో కీలక ప్రాత పోషించినందుకు వరి విభాగంలో కీటక శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.ఓంప్రకాష్ ఉత్తమశాస్త్రవేత్త అవార్డును అందుకున్నారు. అలాగే వరంగల్ వ్యవసాయ ప్రాంతీయ పరిశోధనా స్థానంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న భూక్యా రమేష్ ఉత్తమ సేవా అవార్డును అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న సీనియర్ అసిస్టెంట్ రమేష్, ఓంప్రకాష్, సంధ్యాకిషోర్

డిగ్రీ విద్యార్థులకు ఆర్‌బీఐ ఆధ్వర్యంలో క్విజ్ పోటీ

పోస్టర్ ఆవిష్కరించిన కేయూ రిజిస్ట్రార్, ఆర్‌బీఐ అధికారి

కేయూక్యాంపస్, సెప్టెంబరు 3: డిగ్రీ విద్యార్థులకు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా సువర్ణావకాశాన్ని కల్పించింది. క్విజ్‌లో పాల్గొని రూ.10 లక్షలు మొదటి, రూ.8లక్షలు రెండో బహుమతి, అలాగే రూ.6లక్షలు మూడో బహుమతిగా గెలుచుకునే బంపర్ ఆఫర్‌ను వెల్లడించింది. ఈ మేరకు మంగళవారం కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, ఆర్‌బీఐ అధికారి మహ్మద్ అలీ బాబాలు రిజిస్ట్రార్ చాంబర్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. వర్సిటీ పరిధిలో డిగ్రీ చదువుతూ, 25 ఏళ్ల వయస్సు కలిగిన యువతీ, యువకులు క్విజ్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు క్యూఆర్ కోడ్ ద్వారా ఇద్దరు కలిసి గ్రూపుగా వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. క్విజ్ పోటీలు జాతీయ స్థాయిలో నాలుగు రౌండ్‌లుగా జరుగుతాయని తెలిపారు. మొదటి రౌండ్ ఆన్‌లైన్‌లో ఉంటుందని వెల్లడించారు. మొదటి రౌండ్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా రెండో రౌండ్‌కు అర్హత సాధిస్తారని, అయితే రెండో రౌండ్ రాష్ట్రస్థాయిలో జరుగుతోందని పేర్కొన్నారు. అలాగే మూడో రౌండ్ జోనల్ స్థాయిలో జరుగుతోందని వెల్లడించారు. దీనిలో అత్యున్నత ప్రతిభ చూపిన వారికి జాతీయస్థాయిలో నాలుగో రౌండ్ జరుగుతుందని వివరించారు. 2, 3, 4వ రౌండ్‌లు ఆఫ్‌లైన్‌లో జరుగుతాయని, ఆయా రౌండ్‌లకు ఎంపికైన వారికి రవాణా, భోజనం, ఇతర ఖర్చులను ఆర్‌బీఐ భరిస్తుందని పేర్కొన్నారు. కాగా, పోటీల్లో పాల్గొన్న వారందరికీ ఆర్‌బీఐ తరుపున సర్టిఫికెట్లను అందచేస్తారని తెలిపారు. ఇతర వివరాలకు www.rbi.org.inలో చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ అధికారి మహ్మద్ అలీబాబా, లీడ్ బ్యాంకు ఆఫీసర్ హవేలీరాజు, ఫైనాన్సియల్ లిటరసీ క్రెడిట్ కౌన్సిలర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



క్విజ్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి, అధికారులు

అధైర్యం వద్దు.. అండగా ఉంటాం

(5వ పేజీ తరువాయి)

సమీప ప్రాంతాల రెవెన్యూ, పోలీసులను రప్పించి, రంగంలోకి దింపాలన్నారు. ఎక్కడైతే ప్రమాదాలు, వరదల నష్టం జరుగుతుందో ఆయా ప్రాంతాలను గుర్తించి బ్లూబుక్ తయారు చేసి కలెక్టరేట్‌లో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ముందుముందు ఇలాంటి విపత్తులు ఏర్పడే అవకాశం ఉంటే అధికారులు మారినా.. ఆ బ్లూబుక్‌లోని సమాచారం ద్వారా చరిత్ర పునరావృతం కాకుండా జాగ్రత్తపడే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాకు చెందిన మంత్రులు, ఇన్‌చార్జ్ మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రజల మధ్యనే ఉండి ప్రజల కష్టనష్టాలను తెలుసుకుని అధికారులకు వివరించి అన్ని విధాలుగా ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. తమ ప్రభుత్వం బురద.. వరద రాజకీయాలు చేయదని, చిత్తశుద్ధితో పనిచేస్తుందని చెప్పారు. స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు వరద బాధితుల సాయం కోసం ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.



సీతారాంతండాలో వరద బాధితులతో మాట్లాడుతున్నసీఎం రేవంత్‌రెడ్డి

మానుకోటలోనూ హైడ్రా తరహా చర్యలకు ఆదేశం

మహబూబాబాద్ జిల్లాలో ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలు, నాలాలు కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలను కూల్చివేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో అక్రమణల కూల్చివేతకు శ్రీకారం చుట్టిన హైడ్రా తరహాలోనే ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ నాలా చెరువులను ఆక్రమిస్తే కూల్చివేయడానికి కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నామని వెల్లడించారు. చెరువులు, నాలాలు, బఫర్‌జోన్‌ల ఆక్రమణల వల్లనే భారీ వర్షాలు చోటు చేసుకున్నప్పుడు వరద ముంపుతో తీవ్రనష్టం వాటిల్లుతుందన్నారు. రాష్ట్రమంతా చెరువులు, నాలాల ఆక్రమణలపై స్పెషల్ డ్రైవ్‌లు చేపడుతామని చెప్పారు. ప్రకృతిని చెరబట్టాలని చూస్తే ప్రకృతి ప్రకోపాన్ని చూడాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఉత్తరాఖండ్, తెలంగాణ, విజయవాడ, హైదరాబాద్ ఎక్కడైనా సరే ప్రకృతిమీద దాడిచేస్తే తప్పకుండా దుష్ఫలితాలు చూడాల్సి వస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆక్రమణలకు సంబంధించి హైకోర్టు ఇతరత్రా ఏ కోర్టుల్లో కేసులు ఉన్నా.. చట్టపరంగా, న్యాయపరంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములు, కుంటలు, చెరువులను ఆక్రమించిన భూ కబ్జాదారులు ఎంతటి వారైనా వదిలేది లేదని, ఎంతటి ఒత్తిడి వచ్చినా.. వెనక్కి తగ్గేదే లేదని తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని పునరుద్ఘాటించారు. అక్రమంగా కట్టడాలు చేపట్టి ఉంటే వెంటనే స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అప్పగించాలని కోరారు. లేని పక్షంలో తామే చర్యలు తీసుకుని కూల్చివేయిస్తామన్నారు. చెరువులు, నాలలు ఆక్రమణలకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వవిప్ జాటోతు రాంచంద్రునాయక్, ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, మామిడాల యశస్వినిరెడ్డి కోరం కనకయ్య, కేఆర్.నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్ పాల్గొన్నారు.

సీతారాంతండా బాధితులకు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అండ



సీఎంకు తన జీతం చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

మరిపెడ మండలం తండాధర్మారం శివారు సీతారాం తాండా ముంపు బాధిత కుటుంబాల సహార్థం కోసం పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తన ఒకనెల వేతనం రూ.2.75 లక్షలను విరాళంగా ప్రకటించారు. ఈ సందర్భంగా సీతారాంతాండాలో సీఎం రేవంత్‌రెడ్డికి విరాళానికి సంబంధించిన చెక్కును మల్లన్న అందచేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్ఈలు కృష్ణారెడ్డి, సురేందర్, డీఈఈ అనూష, శ్రీనివాస్, మరిపెడ తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో విజయ, ఎంపీవో సోమ్లానాయక్ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న విద్యార్థిని

కిడ్డీబ్యాంకులో దాచుకున్న రూ.3వేలను సీఎంకు అందజేసిన సాయిసింధు

మహబూబాబాద్ టౌన్ : వరదలో మహబూబాబాద్ జిల్లా అతలాకుతలమైన వేళ మహబూబాబాద్ పట్టణానికి చెందిన పదో తరగతి విద్యార్థిని చలించిపోయింది. తన తల్లిదండ్రులు పాకెట్ మనీగా ఇవ్వగా కిడ్డీ బ్యాంకులో దాచుకున్న రూ.3వేలను వరద బాధితుల సహాయార్థం అందించి పెద్దమనుసును చాటుకుంది. మహబూబాబాద్ పట్టణానికి చెందిన ముత్యాల గీతవాణి- ప్రవీణ్‌కుమార్ దంపతుల కుమార్తె సాయిసింధు స్థానిక ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన జిల్లావాసులకు అండగా ఉండేందుకు తాను దాచుకున్న డబ్బు రూ.3వేలను ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించేందుకు గాను మంగళవారం మానుకోటకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి ఇచ్చింది. దీంతో సీఎం సింధును అభినందించారు.



సీఎం సహాయనిధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రూ.3వేలను అందిస్తున్న చిన్నారి సాయిసింధు

శరవేగంగా జాతీయ రహదారి మరమ్మతులు



శరవేగంగా సాగుతున్న జాతీయ రహదారి మరమ్మతు పనులు



వరద ఉధృతికి పాడైన జాతీయ రహదారిని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మరిపెడ, సెప్టెంబరు 3 : భారీ వర్షాలతో ఆకేరు నది వరద ఉధృతితో మరిపెడ మండలం పీఎస్‌గూడెం దగ్గర పాడైన 365 జాతీయ రహదారి పునరుద్ధరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను మంగళవారం సీతారాంనాయక్‌తండాకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. పునరుద్ధరణ పనులు తాత్కలికంగా చేపట్టినప్పటికి మళ్లీమళ్లీ ఇలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు పకడ్బందీ, పక్కా ప్రణాళికలతో నివేదికలు తయారు చేయాలని సూచించారు. జిల్లా అధికార యంత్రాం గం పీఎస్ గూడెం బ్రిడ్జి దగ్గర మూడు ప్రొక్లయినర్లను ఏర్పాటు చేసి, పనులు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల్లో పనులు పూర్తి చేసి రోడ్డు మార్గం పునరుద్ధరించేలా పనులు జరుగుతున్నాయి.

సీరోలు ఎస్సై నగేష్‌కు సీఎం సత్కారం



సీరోలు ఎస్సై నగేష్‌ను సత్కరిస్తున్న సీఎం, మంత్రులు

సీరోలు , సెప్టెంబరు 3 : వరదలతో నీట మునిగిన సీతారాంతండా ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించిన సీరోలు ఎస్సై నగేష్ సేవలు భేష్ అని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. మహబూబాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించిన సీఎం సుమారు 100 మంది తండావాసులను సీరోలు ఎస్సై నగేష్ తన సిబ్బందితో కలిసి సురక్షిత ప్రాంతాలకు తరలించారని, ఈ క్రమంలో నడవలేని స్థితిలో ఉన్న 60 ఏళ్ల వృద్ధురాలిని కావడికి జోలెకట్టి స్వయాంగా ఆయన కావడి మోసి సురక్షిత ప్రాంతానికి తరలించి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మంత్రులు పొంగులేటి, సీతక్కతో కలిసి నగేష్‌ను సత్కరించారు.

సీఎం పర్యటన సాగిందిలా..

మరిపెడ, సెప్టెంబరు 3 : మరిపెడ మండలంలో మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి పర్యటన 32నిమిషాల పాటు కొనసాగింది. ఖమ్మం నుంచి రోడ్డుమార్గంలో మ ధ్యాహ్నం 12.54నిమిషాలకు సీతారాంతండా స్టేజీకి చేరు కున్న ఆయన తొలుత మంత్రులు, అధికారులతో కలిసి ధ్వంసమైన జాతీయ రహదారిని పరిశీలించారు. అక్కడి నుంచి కాలినడకన 1.03 నిమిషాలకు సీతారాంతండాకు చేరుకున్నారు. 10నిమిషాల పాటు పలువురు బాధితుల ఇళ్లకు వెళ్లి జరిగిన నష్టం గురించి తెలుసుకున్నారు. రోధిస్తున్న బాధిత కుటుంబాల వారిని ఓదార్చారు. 1.13 నిమిషాలకు బాధిత కుటుబాలను ఉద్దేశించి 11 నిమిషాలు వారితో మాట్లాడారు. 1.26 నిమిషాలకు కాన్వాయ్ ద్వారా మహబూబాబాద్ కలెక్టరేట్‌కు బయలుదేరి వెళ్లారు. 1:45 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకున్న సీఎం ఫొటోప్రదర్శన తిలకించి 1:50 గంటలకు సమీక్ష ప్రారంభించారు. 2:35 గంటలకు సమీక్ష ముగించుకుని వెళ్లిపోయారు.

నిరంతరాయంగా..

- తాళ్లపూసపల్లిలో రైల్వే ట్రాక్ మరమ్మతులు పూర్తి
- గూడ్స్ రైలుతో ట్రయల్‌రన్ నిర్వహణ
- ఇంటికన్నె వద్ద యుద్ధప్రాతిపదికన పనులు
- పునరుద్ధరణ పనుల్లో వెయ్యి మందికిపైగా సిబ్బంది



ఇంటికన్నె సమీపంలో రైల్వే ట్రాక్ మరమ్మతు పనుల్లో కూలీలు

కేసముద్రం, సెప్టెంబరు 3 : ఇటీవలి భారీ వర్షం, వరద బీభత్సం కారణంగా సికింద్రాబాద్-విజయవాడ సెక్షన్‌లోని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి-మహబూబాబాద్ రైల్వే స్టేషన్ల మధ్య, కేసముద్రం-ఇంటికన్నె రైల్వేస్టేషన్ల మధ్య వరద ప్రవాహానికి ట్రాక్ ధ్వంసమై రైళ్ళ రాకపోకలు పూర్తిగా నిలిచిన విషయం తెలిసిందే. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు పడిన భారీ వర్షం కారణంగా తాళ్లపూసపల్లి-మహబూబాబాద్ రైల్వేస్టేషన్ల మధ్య 432, 434 కిలోమీటరు వద్ద సుమారు 20 మీటర్ల పొడవు, అలాగే ఇంటికన్నె వద్ద 418 కిలోమీటరు వద్ద 40 మీటర్ల పొడవు రైల్వే ట్రాక్ వరద తాకిడికి ధ్వంసమైంది. ఫలితంగా శనివారం రాత్రి నుంచి సికింద్రాబాద్-విజయవాడ సెక్షన్ల మధ్య రైళ్ల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో అప్రమత్తమైన రైల్వే శాఖ ఆదివారం సాయంత్రం నుంచే పట్టాల మరమ్మతు పనులు చేపట్టి నిరంతరాయంగా కొనసాగిస్తోంది. దీంతో తాళ్లపూసపల్లి-మహబూబాబాద్ మధ్య మంగళవారం ఉదయం వరకు ట్రాక్‌ను సిద్ధం చేసి మధ్యాహ్నం ట్రయల్ రన్‌లో భాగంగా గూడ్స్ రైలును కూడా నడిపించారు. ఇక ఇంటికన్నె వద్ద ట్రాక్ బాగా దెబ్బతినడంతో మరమ్మతు పనులకు సమయం పడుతోంది. సోమవారం ఉదయం నాటికి వరద ప్రవాహం కొంత తగ్గుముఖం పట్టడంతో ఎనిమిది ఎక్స్‌కవేటర్ యంత్రాలను తీసుకువచ్చి రైలు కట్ట పటిష్ఠం కోసం మంగళవారం సాయంత్రం వరకు మట్టికట్టను పోశారు. యంత్రాలతో కంకర నింపుతున్నారు. మరోవైపు ఇదే ప్రాంతంలో పాక్షికంగా దెబ్బతిన్న రైల్వే ట్రాక్ వద్ద సిబ్బందితో మరమ్మతులు చేయిస్తున్నారు. ఇక్కడ రైల్వే ఇంజనీరింగ్ కార్మికులు, ఓహెచ్ఈ(ఓవర్ హెడ్ ఎలక్ట్రికల్స్), కమ్యూనికేషన్స్ తదితర విభాగాలకు సంబంధించిన వెయ్యి మందికి పైగా సిబ్బంది మరమ్మతు పనుల్లో పాల్గొనడం గమనార్హం. మంగళవారం రాత్రి పట్టాలను ఏర్పాటు చేయడం, కంకర ప్యాకింగ్ పూర్తి చేసి బుధవారం మధ్యాహ్నం వరకు రైలు పట్టాల పునరుద్ధరణ జరిగే అవకాశం ఉందని రైల్వే వర్గాలు భావిస్తున్నాయి.

రైళ్ల పునరుద్ధరణకు మరో రెండురోజులు!

కాజీపేట, సెప్టెంబరు 3: భారీవర్షాల నేపథ్యంలో ఇంటికన్నె-కేసముద్రం, తాళ్లపూసలపల్లి-మహబూబాబాద్ మధ్య రైల్వే ట్రాక్ దెబ్బతినడంతో విజయవాడ వైపు వెళ్లే అన్ని రైళ్లను రద్దుచేసిన సంగతి తెలిసిందే. విజయవాడ వైపు వెళ్లే రైళ్లు మంగళవారం సైతం రద్దు చేశారు. ఆ రూట్‌లలో రైళ్ల పునరుద్ధరణకు మరో రెండురోజులు పట్టే అవకాశం ఉందని రైల్వే అధికారులు చెబుతున్నారు. తాళ్లపూసలపల్లి - మహబూబాబాద్ మధ్య దెబ్బతిన్న రైల్వే ట్రాక్‌ను రైల్వే సిబ్బంది రేయింబవళ్లు పనిచేయడంతో ఆ ట్రాక్‌ను మంగళవారం మరమ్మతును పూర్తి చేశారు. ఆ ట్రాక్‌పై ట్రయల్ రన్ సైతం పూర్తి చేశారు. ఇదే రూట్‌లో ఇంటికన్నె - కేసముద్రం మధ్య దెబ్బతిన్న రైల్‌ట్రాక్ పునరుద్ధరణ పనులు ఇంకా కొనసాగుతున్నాయి, ఈ ట్రాక్ మరమ్మతులు పూర్తిచేస్తేనే ఆ రూట్‌లో రైళ్లు నడుప నున్నామని, అందుకు మరోరెండు రోజులు పట్టే అవకాశం ఉందని రైల్వే అధికారులు తెలిపారు.

ముగ్గురిని బలితీసుకున్న బొగ్గులారీ

ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన ఘటనలో ముగ్గురి మృతి

- మృతుల్లో తొర్రూరుకు చెందిన దంపతులు, పాలకుర్తికి చెందిన మహిళ
- జనగామ జిల్లా వావిలాలలో ఘటన



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డి

పాలకుర్తి/తొర్రూరు రూరల్, సెప్టెంబరు 3 : మృత్యువై దూసుకొచ్చిన ఓ బొగ్గులారీ ముగ్గురిని బలితీసుకుంది. మూలమలుపు వద్ద ఆ లారీ బస్సును ఢీ కొట్టడంతో బస్సులో ప్రయాణిస్తున్న దంపతులు సహా ఓ మహిళ మృతిచెందారు. మరో నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని వావిలాల గ్రామ శివారులో మంగళవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డిపో నుంచి పాలకుర్తి- తొర్రూరు షటిల్ సర్వీసుగా ఓ ఆర్టీసీ బస్సు పాలకుర్తి నుంచి తొర్రూరుకు మొత్తం 18మంది ప్రయాణికులతో వెళుతోంది. ఈ క్రమంలో పాలకుర్తి మండలం వావిలాల గ్రామ శివారులో మూలమలుపు వద్ద తొర్రూరు నుంచి పాలకుర్తి వైపు వస్తున్న ఓ బొగ్గు లారీ ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం టీక్యాతండాకు చెందిన జాటోతు హేమాణి(55), బుజ్జి (50) దంపతులతో పాటు పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన ఎండి.నసీమా (55) మృతి చెందా రు. అలాగే జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదం జరిగిన తీరును ఆరా తీశారు. అయితే బొగ్గులారీ డ్రైవర్ మద్యం మత్తులో బస్సు నడపడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని తెలుస్తోంది. ఈ ఘటనలో మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం టీక్యాతండాకు చెందిన జాటోతు బాలాజీ, వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన కోలపల్లి భూలక్ష్మి, ఎర్ర సత్యవతి, పాలకుర్తి మండలం నారబోయినగూడెం గ్రామానికి చెందిన తిరుపల్లి నాగమ్మకు స్వల్ప గాయాలయ్యాయి.



తొర్రూరులో చికిత్స పొందుతున్న జాటోతు బాలాజీ

కుమారుడు, కూతురు వద్దకు వెళ్లి వస్తుండగా..

హేమాణి, బుజ్జి దంపతులు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న తమ చిన్న కుమారుడు సుమన్, కుమార్తె అరుణలను చూసేందుకు నాలుగు రోజుల క్రితం మరో ఇద్దరు కుటుంబసభ్యులతోకలసి వెళ్లారు. తిరిగి హైదరాబాద్ నుంచి సోమవారం ఇంటికి బయల్దేరిన వారు సాయంత్రానికి దేవరుప్పల మండలం పెద్దతండా శివారు దోనెబండ తండాలో నివాసం ఉండే బుజ్జి సోదరి అయిన బానోతు రుక్కి ఇంటికి వెళ్లారు. రాత్రి అక్కడే బస చేసిన ఆ నలుగురు మంగళవారం తెల్లవారు జామున దోనెబండ తండా నుంచి పాలకుర్తి చేరుకుని.. అక్కడ తొర్రూరు వెళ్లే బస్సు ఎక్కారు. మార్గమధ్యలో వావిలాల వద్ద జరిగిన ప్రమాదంలో బస్సులో కుడివైపు కూర్చున్న హేమాని, బుజ్జి దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ క్రమంలో హేమానీ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాల పాలైన హేమాని బార్య బుజ్జిని తొర్రూరులోని ప్రైవేటు ఆసత్రికి తర లించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతులకు ఇద్ద రు కుమారులు సోములు, సుమన్, అరుణ ఉన్నారు. ఇక మరో మృతురాలు ఎండి. నసీమాది పాలకుర్తి మండల కేంద్రం. నసీమా తొర్రూరు మండలం నాంచారిమడూరు గ్రామశివారులోని మహత్మాజ్యోతిబాపూలే డిగ్రీ గురుకుల కళాశాలలో ఔట్ సోర్సింగ్ వంట మనిషిగా పని చేస్తోంది. రోజు లాగే విధులకు వెళ్లే క్రమంలో ఆమె ప్రమాదానికి గురైంది. నసీమాకు భర్త బడేసాబ్ కుమారులు యాకూబ్, మహబూబ్‌పాషా ఉన్నారు.

ఘటనా స్థలిని సందర్శించిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

ప్రమాద విషయం పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డితో కలిసి ఘటన స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ముగ్గురు మృతి చెందడంపై దిగ్ర్భాంతి వ్యక్తం చేసిన ఆమె బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అయితే ఎమ్మెల్యే ఆస్పత్రిని సందర్శించిన సమయంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో కలెక్టర్‌కు ఫోన్ చేసి గైర్హాజరైన వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మృతురాలు నసీమా భర్త బడేసాబ్‌తో మాట్లాడి ఓదార్చారు. బీఆర్ఎస్ తరుపున ఆదుకుంటామని భరోసానిచ్చారు.

లారీ డ్రైవర్ మద్యం తాగడమే కారణమా?

ఆర్టీసీ బస్సును ఢీ కొట్టి ముగ్గురు మృతికి కారణమైన బొగ్గు లారీ డ్రైవర్ మద్యం సేవించి వాహనాన్ని నడపడం వల్ల ఈ ఘోర ప్రమాదం జరిగిందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఘటనకు అరగంట ముందు సదరు డ్రైవర్ వావిలాల గ్రామంలో లారీ నిలిపి బెల్ట్ దుకాణంలో మద్యం తాగినట్టు తెలిసింది. ఆ డ్రైవర్ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించగా.. ఘటన జరిగిన కొద్దిసేపటికే డ్రైవర్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్టు సమాచారం.

దంపతుల మృతితో టీక్యాతండాలో విషాదం

పాలకుర్తి మండలం వావిలాల గ్రామశివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తొర్రూరు మండలం మండలం వెల్లికట్టె గ్రామ శివారు టీక్యాతండాకు చెందిన జాటోతు హేమానీ(60) బుజ్జమ్మ(55) దంపతులు మృతిచెందడంతో తీవ్ర విషాదం నెలకొంది. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించే వీరు హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడు సుమన్, కుమార్తె అరుణను చూసివచ్చేందుకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో ప్రమాదానికి గురై మృతిచెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

ఎన్పీడీసీఎల్‌కు తీరని నష్టం

- దెబ్బతిన్న స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్స్, ఇన్సులేటర్లు
- సుమారు 5 కోట్లకుపైగా నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 2: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎన్పీడీసీఎల్‌కు తీరని నష్టం వాటిల్లింది. వరదనీటి ధాటికి పలు స్తంభాలు పూర్తిగా దెబ్బతినడం, నేలమట్టం కావడం, పవర్ ట్రాన్స్‌పార్మర్ల్, ఇన్సులేటర్లు దెబ్బతినడంతో విద్యుత్ సరఫరాలకు ఆటంకం కలిగింది. విద్యుత్ సిబ్బంది యుద్ధప్రాతిపదిక మరమ్మతుల చేపట్టి కమర్షియల్, డొమెస్టిక్ సర్వీసులకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మహబూబాబాద్ జిల్లాలోని చిన్నగూడూరు, నర్సింహులపేట, మరిపెడ, ఎల్లంపేట మండలాల్లో వర్షపాతం ఎక్కువగా ఉండటంతో ఆ ప్రాంతాల్లో విద్యుత్ శాఖకు ఎక్కువగా నష్టం జరిగింది. ఆకేరువాగు తాకిడికి ఉల్లంపల్లిలో 33 బై 11 కేవీ సబ్‌స్టేషన్ నీట మునగడంతో కంట్రోల్‌రూమ్, ప్యానల్స్, ఇతరత్ర సామగ్రి దెబ్బతిన్నాయి. జిల్లాలో ప్రవహిస్తున్న పాలేరు, ఆకేరు, మున్నేరు, పాఖాలవాగు తీరం వెంబడి ఉన్న వ్యవసాయ కనెక్షన్లకు సంబంధించి సుమారు 900 విద్యుత్ స్తంభాలు దెబ్బతినడంతో పాటు కొన్ని నెలకొరగగా, 150 పైగా ట్రాన్స్‌పార్మర్ల్ నీట మునగడం, ప్లింత్ నుంచి నీటిలో పడిపోయాయి. తాత్కాలికంగా విద్యుత్ సరఫరా చేసేందుకు వీటిన్నింటి మరమ్మతులకు కలిపి సుమారు రూ.40 లక్షల వరకు అంచనా వేస్తుండగా పూర్తి స్థాయిలో మరమ్మతుల చేసేందుకు సమారు రూ.2కోట్ల వరకు ఖర్చు అవుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. నివాసాలకు సరఫరా చేసే విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మలు విరిగిపడి చాలా చోట్ల తీగలు తెగిపోగా వెంటనే సిబ్బంది రంగంలోకి దిగి పునరుద్ధరించినట్లు తెలిపారు. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేస్తూ అంతరాయాలు లేకుండా చేసే ప్రయత్నం చేశారు. కొన్ని చోట్ల సబ్‌స్టేషన్‌ల్లోకి నీరు చేరడంతో ప్రత్యామ్నాయ పద్ధతిలో పక్క సబ్‌స్టేషన్‌ల నుంచి విద్యుత్‌ను సరఫరా చేశారు.

స్వీయ నియంత్రణ ముఖ్యం

వినియోగదారులు ఎట్టిపరిస్థితుల్లో స్వయంగా విద్యుత్ మరమ్మతులు చేయరాదని వివిధ జిల్లాల సర్కిల్ అధికారులు సూచిస్తున్నారు. విద్యుత్ స్తంభాలు, ఇంట్లోని స్విచ్ బోర్డులను తడిచేతులతో తాకరాదన్నారు. విద్యుత్ అంతరాయంతో పాటు విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్య ఉన్నా.. విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్ 1912, 18004250028 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. అర్థరాత్రి వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఉన్నతాధికారుల అదేశాలతో విద్యుత్‌ను పునరుద్ధరించిన సిబ్బందిని ఆయా జిల్లాల ఎస్ఈలు ప్రత్యేకంగా అభినందించారు.



ములుగు జిల్లాలో క్రేన్ సహాయంతో కొత్త పోల్‌ను ఏర్పాటు చేస్తున్న విద్యుత్ అధికారులు

నష్టం

భూపాలపల్లి జిల్లాలో 263 స్తంభాలు, 2 పవర్ ట్రాన్స్‌పార్మర్స్, 9 డీటీఆర్‌లు దెబ్బతినగా సుమారు 1.60 లక్షల నష్టం వాటిల్లినట్లుగా విద్యుత్ అధికారులు అంచనా వేశారు. వరంగల్ జిల్లాలో ఇప్పటి వరకు 193 విద్యుత్ పోల్స్ 95 ట్రాన్స్‌పార్మర్స్ దెబ్బతినగా 1.20 లక్షల నష్టం వాటిల్లిందని, ఇంకా ఈ నష్టం పెరిగే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. జనగామలో 22 విద్యుత్ స్తంభాలు, 2 ట్రాన్స్‌పార్మర్స్ దెబ్బతినగా 2 లక్షల నష్టం వాటిల్లిందని అంచనాకు వచ్చారు. హనుమకొండ జిల్లాలో 18 పోల్స్ 23 ఇన్సులేటర్లు, 1 ట్రాన్స్‌పార్మర్ దెబ్బతినగా రూ.1.8 లక్షల నష్టం జరిగిందని అధికారులు తెలిపారు.

దెబ్బతిన్న చోట వెంటనే పునరుద్ధరణ పనుల చేపట్టాలి

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 3: మరో రెండు రోజులు భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని టీజీ ఎన్పీడీసీఎల్ కర్నాటీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలతో మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. మహబూబాబాద్, భూపాలపల్లి, ఖమ్మం జిల్లాల్లో వరదల కారణంగా చెట్లు విరిగిపడి చాలా చోట్ల విద్యుత్ తీగలు తెగడం, స్తంభాలు, ట్రాన్స్‌పార్మర్లు నీటమునగడం, ఇన్సులేటర్లు దెబ్బతినడం జరిగాయన్నారు. వాటి పనులను వేగంగా పునరుద్ధరణ చేయాలని ఆదేశించారు. కావాల్సిన మెటీరియల్, సిబ్బందిని అందిస్తామన్నారు. మునిగిపోయిన ట్రాన్స్‌పార్మర్లు, లైన్ల వద్ద నీటి ప్రవాహం తగ్గిన తర్వాత పునరుద్ధరణ పనులు చేపట్టాలన్నారు. వర్షాల కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నా యంగా మరొక సబ్‌స్టేషన్ నుంచి సరఫరా ఉండేలా ముందస్తుచర్యలు చేపట్టాలన్నారు. తద్వారా అంతరాయలు తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు బి.అశోక్‌కుమార్, టి.సదర్‌లాల్, టి.మధుసూ దన్, సీజీఎం రాజు చౌహాన్, జీఎంలు నాగప్రసాద్, మల్లిఖార్జున్, అన్నపూర్ణ, శ్రీనివాస్, అంకుశ్, డీఈలు అనిల్‌కుమార్, శ్రీధరాచారి, రమణారెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో ఉరి వేసుకొని ఆత్మహత్య



మహేందర్ (ఫైల్)

ధర్మసాగర్, సెప్టెంబర్ 3: ఉరి వేసుకొని మొగిలిచర్ల మహేందర్ (38) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై పోచయ్య మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామానికి చెందిన మహేందర్ 18 ఏళ్ల కిందట రఘునాథపల్లి మండలం తాటికాయల గ్రామానికి చెందిన రమతో వివాహమైంది. గ్రామంలోనే లాండ్రీషాపు నడుపుకుంటూ ఇద్దరు జీవిస్తున్నారు. వీరికి సంతానం కాకపోవడంతో రమ మానసికంగా అనారోగ్యానికి గురైంది. దీంతో నాలుగు నెలల కిందట రమ తల్లిదండ్రులు ఆమెను పుట్టింటికి తీసుకెళ్లారు. దీంతో భార్య రావడం లేదని మనస్థాపం చెందిన మహేందర్ సోమవారం రాత్రి హనుమకొండలో ఉంటున్న తన అక్క స్వరూపకు ఫోన్ చేసి తాను చనిపోతున్నానని చెప్పాడు. మంగళవారం తెల్లవారుజామున స్వరూప మహేందర్‌కు ఫోన్ చేయగా ఎంతకూ ఫోన్ ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి చుట్టుపక్కల వారికి ఫోన్ చేసి తమ్ముడు మహేందర్ ఫోన్ ఎత్తడం లేదని చెప్పడంతో వారు మహేందర్ ఇంటికి వెళ్లి కిటికీలోంచి చూశారు. మహేందర్ ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయన్ని మృతుడి కుటుంబ సభ్యులకు, గ్రామస్థులకు తెలపడంతో వారు విచ్చేసి స్థానికుల సాయంతో పోలీసులకు సమాచారాన్ని అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి విచ్చేసి మృత దేహాన్ని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాగులో పడి రైతు గల్లంతు

నెక్కొండ మండలం గుండ్రపల్లి శివారులో ఘటన



గల్లంతైన రైతు అజీమత్

నెక్కొండ, సెప్టెంబరు 3: వాగు దాటుతుండగా రైతు గల్లంతైన ఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గుండ్రపల్లి గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు, రెవెన్యూ అధికారుల కథనం ప్రకారం. గ్రామానికి చెందిన షేక్ అజీమత్ (35) వ్యవసాయ పనుల కోసం వెళ్లాడు. పనులు ముగించుకుని ఇంటి బయలుదేరాడు. గ్రామ శివారులోని వట్టివాగు దాటుతుండగా నీటి ప్రవాహం పెరగడంతో వాగులో కొట్టుకుపోయాడు. సమీపంలోని రైతులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న నెక్కొండ తహసీల్దార్ రాజ్‌కుమార్, చెన్నారావుపేట ఎస్సై అరుణ్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని రైతు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అజ్మత్‌కు భార్య చాందిని, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఓటరు జాబితాలను సమీక్షించాలి



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి స్వరూప

జఫర్‌గడ్, సెప్టెంబరు 3 : ఓటరు జాబితాల రూపకల్పనలో తప్పులు లేకుండా సరిచూసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి స్వరూప సూచించారు. మంగళవారం జఫర్‌గడ్ ఎంపీడీఓ కార్యాలయంలో పంచా యతీ కార్యదర్శులచే సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీపీఓ స్వరూప మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల కోసం అంతా సిద్ధంగా ఉండాలన్నారు. ఈనెల 6న ఓటరు జాబితాలను ప్రదర్శిం చడం జరుగుతుందన్నారు. జాబితాలను పక్కాగా రూపొందించాలన్నారు. వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో సానిటేషన్, పరిశుభ్రతను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఎక్కడా బురద గుంటలు లేకుండా చూసు కోవాలన్నారు. వ్యాధుల పట్ల ప్రజలను చైతన్యం చేయాలన్నారు. పన్నుల వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేయా లన్నారు. బకాయిలు లేకుండా వసూళ్లను పూర్తి చేయాల న్నారు. వ్యాపారం చేసే ప్రతి ఒక్కరూ ట్రేడింగ్ లైసెన్స్‌లు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆమె కార్యదర్శులను ఆదేశించారు. సమావేశంలో ప్రత్యేకాధికారి డాక్టర్ ఎస్ఎల్. మనోహర్, ఎంపీడీఓ సుమన్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమంగా వాడితే చర్యలు

▸▸ వ్యవసాయ బావుల వద్ద రైతులు అప్రమత్తంగా ఉండాలి ▸▸ మీటర్లకు అవసరం ఉన్నవారు డీడీలు చెల్లించాలి ▸▸ టీజీఎన్‌పీడీసీఎల్ డీఈ లక్ష్మీనారాయణ



వడ్డిచర్లలో పొలంబాట కార్యక్రమంలో విద్యుత్ సమస్యలపై అవగాహన కల్పిస్తున్న డీఈ లక్ష్మీనారాయణ

లింగాలఘణపురం, సెప్టెంబరు3: వ్యవసాయబావుల వద్ద విద్యుత్ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ అక్రమంగా వాడితే చర్యలు తప్పవని టీజీఎన్‌పీడీసీఎల్ డీఈ లక్ష్మీనారాయణ సూచించారు. మంగళవారం లింగాల ఘణపురం మండలం వడ్డిచర్ల సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో అధికారులు విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన పొలంబాట కార్యక్రమానికి డీఈ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రైతులు వ్యవసాయబావుల వద్ద ఏదేని విద్యుత్ సమస్య తలెత్తితే సొంతంగా మరమ్మతులు చేసుకునే ప్రయత్నం చేసుకోవద్దని క్షేత్రస్థాయిలో పనిచేసే తమ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యుత్ వైర్ల సమస్యలు, లూజ్‌స్తంభాల సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వ్యవసాయబావుల వద్దకమర్షియల్ మీటర్లు అవసరం ఉన్నవారు నేరుగా డీడీలు చెల్లిస్తే వ్యవసాయ సరఫరాకు చెందిన లైన్ ద్వారా విద్యుత్ కనెక్షన్ ఇస్తామని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ విద్యుత్ అక్రమంగా వాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయితే ఓవర్‌లోడ్ సమస్యతో తరచూ డీటీఆర్‌లు కాలిపోతున్నాయని అంతేకాకుండా మరమ్మతు కోసం వాటిని బయటకు తేవాలనుకుంటే పంటపొలాల్లో ఉండడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాటిని రోడ్లవైపు ఏర్పాటు చేయాలని పలువురు రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనేస్పందించిన డీఈ అటువంటి వాటిని వెంటనే గుర్తించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ అనిల్‌కుమార్, ఏఈ శంకరయ్య, సబ్‌ఇంజనీర్ ఝాన్సీ, లైన్ ఇన్‌స్పెక్టర్ నర్సింహ్మస్వామి లైన్‌మెన్ నర్సయ్య, భాస్కర్, ఏఎల్ఎం సురేష్‌తో పాటుగా రైతులు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వీడాలి

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 3: విద్యుత్ సిబ్బంది వారి విధుల పట్ల నిర్లక్ష్యం వీడాలని విద్యుత్ ఎస్ఈ వేణుమాధవ్ తెలిపారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని ఏడీఈ కార్యాలయంలో శివునిపల్లి, రాజవరం సెక్షన్‌ల పరిధిలో విద్యుత్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఈ పలు సూచనలు చేశారు. భారీ వర్షాలు కురుస్తున్న తరుణంలో సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకొని విద్యుత్ మరమ్మతు పనులు చేయాలన్నారు. నిర్లక్ష్యంగా విధులు నిర్వహించి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు అని సూచించారు. విద్యుత్ పోల్స్‌కు పేయింటింగ్‌తో నెంబర్లు వేయాలన్నారు. గ్రామాల వారిగా ఉన్నటువంటి డీటీఆర్‌లను ఎప్పటికప్పుడు పరిశీలించి వాటిని సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఐఆర్‌డీఏ బిల్లింగ్స్ పై దృష్టి సారించాలన్నారు. విధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండి విద్యుత్ స మస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో డీఈఈ గడ్డం గణేష్, ఏడీఈ వంశీకృష్ణ, ఏఈలు చంద్రమోహన్, రమేష్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహించిన డాక్టర్ సస్పెన్షన్

పాలకుర్తి, సెప్టెంబరు 3 : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న పాలకుర్తి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యుడు డాక్టర్ ఎ. వెంకటేశ్వర్లును సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 2న కలెక్టర్ పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ సమయంలో డాక్టర్ వెంకటేశ్వర్లు విధులకు డుమ్మా కొట్టాడు. ఆగస్టు 4 నుంచి విధులు విధులకు గైర్హాజరు అవుతున్నట్లు కలెక్టర్ విచారణలో తేలింది. ఈ విషయపై స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి స్థానికుల నుంచి అనేక ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో వైద్యుడిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు. సస్పెన్షన్ ఉత్తర్వులను తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్‌కు పంపించారు.

డెంగీ పాజిటివ్ కేసు నమోదు

కొడకండ్ల సెప్టెంబర్ 3 : మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామానికి చెందిన పి.అఖిల(21)కు వైద్య పరీక్షల్లో డెంగీ పాజిటివ్ వచ్చినట్లు మండల వైద్యాధికారి డా.హరికృష్ణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ గర్భిణీ అయిన అఖిల గత ఐదు రోజులుగా జ్వరంతో బాధపడుతుండడంతో ఆమె బంధువులు మంగళవారం పీహెచ్‌సీ తీసుకురావడంతో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఆమె రక్తంలో ప్లేట్‌లెట్‌లు తీవ్రంగా పడిపోయాయని, డెంగీ (ఎన్ఎస్1)పాజిటివ్‌గా కూడా తేలడంతో 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా శ్రీకృష్ణుడి పల్లకీ ఊరేగింపు

బచ్చన్నపేట, సెప్టెంబరు 3: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం బచ్చన్నపేట మండల కేంద్రంలో శ్రీకృష్ణ పల్లకిని అంగరంగ వైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు శ్రీకృష్ణుడి ప్రతిమను పల్లకిలో పెట్టి మండపం నుంచి జనగామ - ఆలేరు రోడ్డు వరకు భక్తుల కోలాటాల నడుమ శావ తీశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు శ్రీనాథ్ శ్రేష్టి, విశ్వ హిందు పరిషత్ సభ్యులు, మండల ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో పోషణమాసం

జనగామ కల్చరల్, సెప్టెంబరు 3: పోషణమాసం పురస్కరించుకొని పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. మంగళవారం జనగామ జిల్లా కేంద్రంలోని కురుమవాడ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషకాహార మాసోత్సవాలలో పిల్లల తల్లులతో కథలు చెప్పించారు. బాలామృతం తీసుకెళ్లిన తల్లులు పిల్లలకు బాలామృతంతో తయారు చేసిన ఐటెం ను చేసిపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ పూర్ణిమ, టీచర్ స్వర్ణలత, ఆయా లక్ష్మి, పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



మహా ధర్నా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

జనగామ రూరల్, సెప్టెంబరు 3: విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ బీసీ, ఓసీ ఉద్యోగుల ఐక్యకార్యాచరణ సమితి జిల్లా అధ్యక్షుడు చారబూడ్ల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ విద్యుత్ బీసీ, ఓసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని హైదరాబాద్‌లో చేపట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని విద్యుత్ ఉద్యోగులు మంగళవారం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో కండిషన్లతో కల్పిస్తున్న పదోన్నతులపై ప్రభుత్వం వెంటనే హైకోర్టు సిట్టింగ్ జడ్జి, జూడిషియల్ కమిషన్‌చే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పదించి తెలంగాణ విద్యుత్ బీసీ, ఓసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. విద్యుత్ ఉద్యోగులు సెప్టెంబర్ 4(నేడు) హైదరాబాద్ నిర్వహించే మహ ధర్నాను జయపద్రం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉల్లెంగుల రాజేష్, రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్, శ్రీవాణి, వెంకటేష్, శ్రీనివాస్, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల వసతుల కల్పనలో నిర్లక్ష్యం వద్దు

అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్



మోడల్ స్కూల్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న అదనపు కలెక్టర్

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 3: హాస్టల్‌లో ఉండే విద్యార్థుల వసతుల కల్పన పట్ల సంబంధిత సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ తెలిపారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలను, హాస్టల్ గదులను పరిశీలించారు. హాస్టల్ గదులలో విద్యుత్ వైర్లు నిర్లక్ష్యంగా ఉండడాన్ని గమనించి విద్యుత్ శాఖ ఎస్ఈ వేణు మాధవ్‌కు ఫోన్ చేసి వెంటనే హాస్టల్‌లో ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు. హాస్టల్‌లో 25 గదులు ఉండగా విద్యుత్ ఏర్పాట్లు సక్రమంగా చేయలేదని, వెంటనే మరమ్మతులు అన్ని పూర్తి చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. హాస్టల్ వరకు ఉన్న రోడ్డు సరిగ్గా లేకపోవడాన్ని గమనించిన ఆయన వెంటనే రోడ్డును వేసేలా సంబంధిత అధికారులు ఎస్టిమేషన్‌లు రూపొందించాలని సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్ డివిజన్ కేంద్రంలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ వైద్యులకు సంబంధించిన హాజరు రిజిస్టర్‌లను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. రోగుల వార్డులను సందర్శించి వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మరుగుదొడ్లు సరిగ్గాలేవని వైద్య సిబ్బంది ఆయన దృష్టికి తీసుకురాగా పీఆర్ ఏఈని పిలిచి వెంటనే మరుగుదొడ్ల నిర్మాణానికి ఎస్టిమేషన్స్ తయారు చేసి మరుగుదొడ్లను నిర్మించేలా చూడాలని ఆదేశించారు. డీపీఓ స్వరూప, జీసీడీఓ గౌసియాబేగం, డీఎల్‌పీఓ వెంకట్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీపాద మధుసూధన్, పీఆర్ ఏఈ రామకృష్ణ, ప్రిన్సిపాల్ శ్రీకాంత్, ఈవో సత్యనారాయణ, సెక్రటరీ జేసుమణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ నాయకుల పరామర్శ

కొడకండ్ల సెప్టెంబరు 3 : మండలంలోని పాకాల గ్రామానికి చెందిన శ్రీ లక్ష్మీనర్సింహ ఫర్టిలైజర్స్ యజమాని ఎలపాటి లక్ష్మారెడ్డి తల్లి వెంకటమ్మ ఇటీవల అనారోగ్య కారణాలతో మృతిచెందారు. రామేశ్వరం గ్రామానికి చెందిన బాచుపల్లి ఎల్లయ్య తల్లి వీరమ్మ మంగళవారం మృతి చెందారు విషయం తెలిసిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి, పాలకుర్తి నియోజ కవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి ఆదేశాలతో కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు డి.సురేష్ నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు మంగళవారం వారింటికి వెళ్ళి వీరమ్మ మృతదేహానికి, వెంకటమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మసురం రవీందర్, అబ్దుల్లా, బత్తుల వెంకన్న, గుగులోత్ నర్సింహ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

కొడకండ్ల : మండలంలోని పాకాల గ్రామానికి చెందిన లక్ష్మీనర్సింహ ఫర్టిలైజర్స్ యజమాని ఎలపాటి లక్ష్మారెడ్డి తల్లి వెంకటమ్మ ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందారు. విషయం తెలిసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాలతో బీఆర్ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు సింధె రామోజి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు మంగళవారం వారింటికి వెళ్ళి వెంకటమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ వైస్‌చైర్మన్ మేటి సోమరాములు , పేరం రాము, డి.వెంకటేశ్వర్‌రావు, మసురం వెంకటనారాయణ, మంగ్యా, ప్రేమ్‌కుమార్ .రణధీర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సర్వేయర్ల సంఘం ఎన్నిక

జనగామ రూరల్, సెప్టెంబరు 3: జనగామ జిల్లా రెవెన్యూ లైసెన్స్ సర్వేయర్ల సంఘం నాయకులు మంగళవారం జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బండ బిక్షపతి, ప్రధాన కార్యదర్శి ధరావత్ శ్రీను, ఉపాధ్యక్షులు బోల్లం సంపత్, కుమారస్వామి, కోశాధికారి సృజన్, సహాయ కార్యదర్శి మట్ట యాదగిరి, ఇతర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బండ బిక్షపతి మాట్లాడుతూ రెవెన్యూ లైసెన్స్ సర్వేయర్ల సమస్యల పట్ల పోరాటం చేస్తూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. సర్వేయర్లు తమ సమస్యలపై ఐక్యంగా ఉండాలని సూచించారు. ఐక్యంగా సమస్యలను ఎదుర్కొందామన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చిలుపూర్, సెప్టెంబరు 3 : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో బర్మావత్ శంకర్ నాయక్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో, తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు, పరిసరాల పరిశుభ్రత తదితర కార్యక్రమాలపై కళాకారులు ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, ప్రస్తుతం భారీగా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని, దోమతెరలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ కృష్ణ, కళాజాత టీం లీడర్ గద్దర్ సాంబయ్య, గడిపె బాలయ్య, తిప్పర్తి శ్రీనివాసులు, బావండ్లపల్లి చిరంజీవి, ముక్కెర సంపత్‌కుమార్, ఎడవెళ్లి విజయ, బొమ్మెర రవి తదితరులు పాల్గొన్నారు.


వరద బాధితులకు అండగా నిలబడిన వారిపై దాడులు సరికాదు

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఖమ్మం వరద బాధితులకు అండగా నిలబడిన వారిపై దాడులు చేయడం సరికాదని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. వరద బాధితులకు సహాయం చేసేందుకు మాజీ మంత్రి టి.హరీష్‌రావు ఆధ్వర్యంలో వెళ్లిన బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులపై కాంగ్రెస్ పార్టీ గూండాలు దాడి చేయడం అత్యంత హేయనీయమైన చర్య అన్నారు. దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం వరద బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత



వెంకటేశ్వర్లపల్లిలో అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఈడీ మాధవీలత

చిలుపూర్, సెప్టెంబరు 3 : కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేక అధికారి మాధవీలత సూచించారు. మంగళవారం డ్రైడే పురస్కరించుకుని మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కూలిపోయిన బట్టమేకల యాదమ్మ ఇంటితో పాటు, పెచ్చులూ డుతున్న జీపీ కార్యాలయ అద్దె భవనాన్ని పరిశీలించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రధాన వీధులతో పాటు, పలువురి ఇంటి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈడీ మాధవీలత మాట్లాడుతూ, పురాతన ఇళ్లల్లో నివాసముం టున్నవారు జాగ్రత్తగా ఉండాలన్నారు. బాధిత కుటుంబాలకు సాయమం దించేం దుకు కృషి చేస్తామన్నారు. ఆమె వెంట పంచాయతీ సెక్రటరీ పన్నీరు మధుసూదన్ తదితరులు ఉన్నారు.

ఘన్‌పూర్ ఇన్‌చార్జ్ డీఈఈగా గణేష్



డీఈఈ గడ్డం గణేష్

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 3: జనగామ జిల్లా కేంద్రంలోని ఎస్ఈ కార్యాలయంలో టెక్నికల్ డీఈఈగా విధులు నిర్వహిస్తున్న గడ్డం గణేష్ స్టేషన్‌ఘన్‌పూర్ ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జి డీఈఈగా మంగళవారం విధుల్లో చేరారు. ఘన్‌పూర్ డీఈఈగా విధులు నిర్వహించిన డీఈఈ హుస్సేన్ నాయక్ నాలుగు రోజుల క్రితం విద్యుత్ లైన్ షిఫ్టింగ్ విషయంలో ఘన్‌పూర్‌కు చెందిన కుంభం రాజు అనే రైతు వద్ద నుంచి రూ 20వేలు లం చం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. కాగా ఆయన స్థానంలో ఘన్‌పూర్ డీఈఈగా గణేష్ విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. బాధితుడు కుంభం రాజుకు సంబంధించిన లైన్ షిఫ్టింగ్‌ను ఒకటి రెండు రోజుల్లో పూర్తి చేస్తామని డీఈఈ తెలిపారు. నూతనంగా విధుల్లో చేరిన డీఈఈని ఏడీఈ వంశీకృష్ణ, ఏఈలు చంద్రమోహన్, రమేష్ సిబ్బంది అభినందించారు.

అభివృద్ధిని మర్చిపోయిన పాలకులు

జనగామ రూరల్, సెప్టెంబరు 3: జనగామ పట్టణ అభివృద్ధిని మున్సిపల్ అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని సీపీఎం నాయకురాలు పందిళ్ల కళ్యాణి, పల్లెల లలిత అన్నారు. జిల్లా కేంద్రంలోని బాణాపురంలో సీపీఎం నాయకులు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనగామలో ఎక్కడి సమస్యలు అక్కడే నిలిచిపోయిన మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని మండిప డ్డారు. జనగామ పట్టణం కంపు కొట్టుతుండడంతో స్థానిక ప్రజలు రోగాల బారిన పడుతున్నారని మున్సిపల్ అధికారులు, పాలకులు స్పదించి సమస్యలను పరిష్కరించాలన్నారు. కళ్యాణం లింగం, శ్రీపతి, మమత, శ్రీను ,మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం అపార నష్టం



మునిగిన పంట పొలాన్ని చూపుతున్న రైతు

తరిగొప్పుల, సెప్టెంబరు 3: గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి మండలంలోని పంటపొలాల్లో వరదలు చేరి కొట్టుకు పోయా యి. మండలంలోని పోతారం - సోలిపూర్ గ్రామాల మధ్యన గల రోడ్డుపై నిర్మించిన కల్వర్టుతో పక్కన గల పోతారం గ్రామానికి చెందిన కందు యాదగిరికి చెందిన మూడెకరాల వరిచేనులోకి వరద నీరు పూర్తిగా చేరి కొట్టుకుపోయింది. దీంతో బాధిత రైతు యాదగిరి మంగళవారం మాట్లాడుతూ కల్వర్టు నిర్మాణం చేసే క్రమంలో కాంట్రా క్టర్ వరద నీరును తన చేను వైపు మళ్లించడంతోనే తనకు తీవ్ర నష్ట వాటిల్లిందన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు స్పందించ తనకు న్యాయం చేయాలంటూ బాధిత రైతు డిమాండ్ చేస్తున్నాడు.

జాతీయ స్థాయి క్రీడలపై దృష్టి సారించాలి

చిలుపూర్, సెప్టెంబరు 3 : యువత జాతీయ స్థాయి క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఎడవెళ్లి మల్లారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని మల్కాపూర్‌లో క్రీడాకారులకు రూ 20 వేల విలువ గల రెండు క్రికెట్ కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ, క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతోనే కిట్లను పంపిణీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షుడు నారాయణరెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు మాదిరెడ్డి యశ్వంత్‌రెడ్డి, క్రీడాకారులు బూర నాదం, రమేష్ పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ కల్చరల్, సెప్టెంబరు 3: జనగామ జిల్లా కేంద్రంలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నర్సయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత పీజీ కోర్సులలో 55శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 55 శాతం సరిపోతుందని, నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. ఇంగ్లీష సబ్జెక్టు బోధించేందుకు 2 పోస్టులు, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ - 1, ఫిజిక్స్ - 1 పోస్టుకు ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 10 సాయంత్రం 4 గంటల లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సెప్టెంబరు 11న ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

వరద బాధితులకు సహాయంపై హర్షం

జనగామ కల్చరల్, సెప్టెంబరు 3: వరద బాధితుల సహాయార్థం తెలంగాణ ఐక్య కార్యాచరణ సమితి (టీజీఈజేఏసీ) ఉద్యోగులందరి తరపున ఒక్క రోజు మూల వేతనాన్ని ఇవ్వడంపై ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఖాజా షరీఫ్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం జనగామ జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఖాజా షరీఫ్ పాల్గొని మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించడమే కాకుండా వరద బాధితుల సహాయార్థం రూ.130 కోట్లు ఇవ్వడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో టీజీవో ప్రధాన కార్యదర్శి కోర్నేలియస్, టీఎన్‌జీవో ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రావు, శ్రీనివాసరావు, పీఆర్‌టీ యూ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహిపాల్‌రెడ్డి, ఎల్లారెడ్డి, లక్ష్మయ్య, రాజు, రాంరెడ్డి, చొక్కయ్య, రామస్వామి, చొక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

జనగామ రూరల్, సెప్టెంబర్ 3: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలోని పాలకుర్తి మండలం వావిలాల గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మరణించిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు జనగామ ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

సీతారాంపురంలో హెల్త్‌క్యాంప్

దేవరుప్పుల, సెప్టెంబరు 3: మండలంలోని సీతారాంపురంలో మంగళవారం మండల వైద్యాధికారి డాక్టర్ పూజ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటలక్ష్మీ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆశవర్కర్లు ప్రేమలత, శ్రీలత, కార్యదర్శి స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు అన్నపూర్ణ, సువర్ణ, యాకమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ విద్యార్థులకు కథల పుస్తకాలపై అవగాహన

దేవరుప్పుల, సెప్టెంబరు 3: అంగన్‌వాడీల పోషణమాసం, సెప్టెంబరు 3న రీడ్ అలోన్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మండలంలోని అన్ని గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాలలో మంగళవారం పిల్లలకు కథల పుస్తకాలలోని చిత్రాలను చూపిస్తూ సులభతరమైన సంభాషణ చేశారు. చిన్నమడూరు, మన్‌పహాడ్ గ్రామాలలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీదేవి, సావిత్రి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు హైమావతి, నర్సమ్మ, లలిత, రేణుక, అన్నపూర్ణ, సువర్ణ, యాకమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

పాలుర్తి, సెప్టెంబరు 3 : పాలకుర్తి మండల టీపీటీఎఫ్ మండల సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆసంఘం నూతన కమిటీ ఎన్నికైంది. టీపీటీఎఫ్ పాలకుర్తి మండల నూతన అధ్యక్షుడుగా డి. వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడుగా ఎ. దయాకర్‌రెడ్డి, ప్రధానకా ర్యదర్శిగా పి. వెంకటనర్సయ్య, కార్యదర్శులుగా షాహీసుల్తానా, శ్రీనివాస్, ఎస్ బుచ్చయ్య జిల్లా కౌన్సిలర్లు ఇమ్మడి అశోక్, ఎస్. శేషగిరావు ఎన్నికయ్యారు.

గ్రామాల్లో మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలి

నర్మెట, సెప్టెంబరు 3 : వినాయక చవితి పండుగ సందర్భంగా ఉత్సవ కమిటీల సభ్యులు మట్టి విగ్రహాలను ప్రతిష్టించాలని కోరుతూ మంగళవారం నర్మెట యువ చైతన్య యూత్ సభ్యులు కరపత్రాలను ఆవిష్కరించారు. భారీ విగ్రహాలను కాకుండా చిన్న చిన్న విగ్రహాలను ప్రతిష్టించి వినాయక చవితిని సంతోషంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు బిజ్జ గోవర్ధన్, కాసాని ఆంజనేయులు, ప్రజ్ఞాపురం రాజేష్, కూరపాటి శ్రీనివాస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి దెబ్బతిన్న చేనేత కార్మికుడి ఇల్లు



కడవెండిలో వర్షం వల్ల దెబ్బతిన్న నల్ల అశోక్ ఇల్లు

దేవరుప్పుల, సెప్టెంబరు 3: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల మండలంలోని కడవెండి గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు నల్ల అశోక్ ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నది. ఇల్లు వెనుక వైపు పైకప్పు గోడతో పాటు పెంకులు కూలిపోయి చిల్లులు పడింది. దీంతో వర్షం రావడంతో ఇళ్లంతా తడిచి ముద్దవుతున్నది. ఇల్లు కూలిపోతుందో ప్రమాదం ఎప్పుడు సంభవిస్తుందోనని భయాంతోళనకు అశోక్ గురవుతున్నాడు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు ఇవ్వాలని కోరారు.